గురువు లేకుండానే అద్భుత ప్రతిభ

2



2
పిడుగుపాటుతో ఆలయ గోపురం పాక్షికంగా ధ్వంసం..

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

ప్రమాద మలుపును పట్టించుకోరేం..!



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలోని హనీ బేకర్స్ మూలమలుపు మృత్యు మలుపుగా మారింది. రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు, అద్దంగా ఉన్న బారికేడ్లతో ఆ మలుపు వాహనదారులకు నరకం చూపుతోంది. బేకరీకి సరిగ్గా ముందే రోడ్డు తేలిపోయి గుంతలు పడ్డాయి. మూలమలుపు కావడంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.



పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు

అక్షరటుడే, డిచ్‌పల్లి: సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకెళ్తోందని రూరల్ ఎమ్మెల్యే దా. భూపతి రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 375 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రతి పేద కుటుంబానికి సొంతంగా పక్కా ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, గత పాలనలో పేదల అభివృద్ధిని విస్మరించారని ఎమ్మెల్యే విమర్శించారు. మహిళలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తోందని, అనేక సంక్షేమ కార్యక్రమాలను మహిళల పేరుతో అమలు చేస్తున్నామని భూపతిరెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, ఇప్పటికే 80 శాతం ఇళ్ల నిర్మాణం సైతం పూర్తి చేసుకున్నారని.. మొదటి విడత కోటాలో మిగిలిన 375 మందికి పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ విడతలో అవకాశం దక్కని అర్హులైన వారికి రెండో విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. రెండో విడతలో మరో 2 వేల ఇళ్లు నియోజకవర్గానికి రానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయరెడ్డి, బాలరాజు, భాస్కర్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్, ఉమ్మాజి నరేష్ పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌ను సన్మానించిన వినయ్ రెడ్డి



అక్షరటుడే, ఆర్మూర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను నార్సింగిలోని ఆయన నివాసంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు వెళ్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

భీర్మల్ తండాలో తమిళనాడు ప్రభుత్వ కార్యదర్శి పర్యటన



అక్షరటుడే, గాంధారి: మండలంలోని భీర్మల్ తండాలో ఆదివారం తమిళనాడు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ టీఎన్ వెంకటేష్ పర్యటించారు. ఈ సందర్భంగా తండాలో కొనసాగుతున్న హస్తకళల పనులను ఆయన పరిశీలించారు. హస్తకళల తయారీ విధానం, కళాకారుల నైపుణ్యం, ఉత్పత్తుల వివరాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. స్థానిక కళాకారులతో మాట్లాడి హస్తకళల తయారీలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హస్తకళల పరిరక్షణ, కళాకారులను ప్రోత్సహించడం వంటి అంశాలను పరిశీలించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ రేణుక చవాన్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఊరూరా స్వచ్ఛ సంగ్రామం



- అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛతా హి సేవ'
- పల్లెల్లో పక్షం రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలు
- చెత్త పేరుకుపోయిన బ్లాక్ స్పాట్ల శాశ్వత ప్రక్షాళన

ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 (గాంధీ జయంతి) వరకు 15 రోజుల పాటు 'స్వచ్ఛతా హి సేవా-2026' కార్యక్రమాలను భారీఎత్తున నిర్వహించనున్నారు. స్వచ్ఛతలో భాగస్వామ్యం - స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్ అనే నినాదంతో ఈ కార్యక్రమం సాగనుంది.
- అక్షరటుడే, ఎల్లారెడ్డి

జిల్లాస్థాయి అధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) డైరెక్టర్ దివ్య దేవరాజన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 15 నాటికి జిల్లా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనుల వివరాలను రోజూ ప్రత్యేక పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ పక్షోత్సవాల్లో భాగంగా 5 ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఏళ్ల తరబడి మురికికూపాలుగా మారిన ప్రాంతాలు, బహిరంగ చెత్త డంపింగ్ యార్డులను యుద్ధప్రాతిపదికన క్లియర్ చేసి తీర్చిదిద్దనున్నారు. మంగళవారం నుంచి ఆయా ప్రాంతాలను గుర్తించి జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియ ప్రారంభించారు.

పాఠశాలలు, కళాశాలల్లో..

పాఠశాలలు, కాలేజీల్లో 'స్వచ్ఛతా జ్ఞాన యాత్ర' పేరిట వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంట్ల విజిట్స్, 'స్వచ్ఛత జల సంరక్షణ' పేరుతో నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వపై చర్చలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి పీపీఈ కిట్లు, సేఫ్టీ గేర్లు అందజేయనున్నారు.

అక్టోబర్ 1న మహా శ్రమదానం

ఈ ప్రచారంలో ముఖ్యంగా అక్టోబర్ 1న ఉదయం 8 గంటలకు 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' (ఒకే రోజు, ఒకే గంట, అందరం కలిసి) పేరిట దేశవ్యాప్త శ్రమదాన కార్యక్రమం జరగనుంది. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, రిటైర్డ్ సైనికులు, పద్మ అవార్డు గ్రహీతలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సాధారణ పౌరులు ఒకే సమయంలో స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. ముగింపు రోజైన అక్టోబర్ 2న గాంధీ జయంతిని 'స్వచ్ఛ భారత్ దివస్' గా నిర్వహించనున్నారు. పల్లెల్లో ప్రత్యేక గ్రామ సభలు, పట్టణాల్లో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి ఘన వ్యర్థాల నిర్వహణపై చర్చిస్తారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలు, పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లకు సన్మానించనున్నారు. శుభ్రం చేసిన ప్రాంతాల్లో 'ఏక్ పేడ్ మా కే నామ్' నినాదంతో భారీగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు.

నాలుగు రకాలుగా చెత్త వేరు చేసే విధానం..

నాలుగు రకాలుగా చెత్త వేరుచేసే విధానంపై ఇంటింటి ప్రచారం, క్రీడా పోటీలు (స్వచ్ఛ స్పోర్ట్స్ ఫర్ స్వచ్ఛత), గణేశ్ ఉత్సవాల్లో పర్యావరణహిత విగ్రహాలు, ఎకో ఫ్రెండ్లీ పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడం, చెత్తతో కళాఖండాల ద్వారా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో పార్కులు, చౌరస్తాల్లో శిల్పాలు, కళాకృతులు రూపొందించనున్నారు. ఆర్ఆర్ఆర్ (రీడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్లను బలోపేతం చేయనున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు "స్వచ్ఛతా హి సేవా 2026" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జీపీల్లో ప్రత్యేక కార్యక్రమాలు

ప్రతి గ్రామ పంచాయతీ నిర్వహించిన కార్యక్రమాల ఫొటోలు, ముందు తర్వాత ఫోటోలు, వీడియోలను https://swachhatahiseva.gov.in/auth/login పోర్టల్ లో అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్ లు, కార్యదర్శులు, VWSC, SHGలు, విద్యార్థులు, యువత అందరూ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మోతేలో క్రీడా సామగ్రి వితరణ



అక్షరటుడే,మోతే (భీమ్‌గల్): యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడల్లో రాణించి శారీరక, మానసిక దృఢత్వాన్ని సాధించాలని మోతే ఉప సర్పంచ్ కర్రోల్ల పరంజ్యోతి కుమార్ సూచించారు. మోతే గ్రామంలో యువకుల కోరిక మేరకు ఆదివారం ఆయన సొంత ఖర్చులతో వాలీబాల్స్, వాలీబాల్ నెట్‌ను అందజేశారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువత గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, బృందస్ఫూర్తి (టీమ్‌వర్క్), ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొల్ల రమేష్, గ్రామ యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి: ఎమ్మెల్యే ధన్‌పాల్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. వర్నీరోడ్‌లోని ఆనంద్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా నల్లహనుమాన్ ఆలయంలో పూజలు చేసి ఆలయ ఆవరణలో నెలకొల్పిన రాఖీ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆనంద్‌నగర్‌లోని నల్ల హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే ఆలయ పునర్నిర్మాణం కోసం డిజైనింగ్ ప్లాన్‌తో, ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ పరంగానే కాకుండా తన ట్రస్ట్ ఆధ్వర్యంలోనూ సహకారం అందిస్తానన్నారు. కాలనీ అంతా కలిసికట్టుగా ఉండి అభివృద్ధి కోసం ఒక్కతాటిపై నడవాలని సూచించారు.


డివిజన్లలో కొనసాగుతున్న పనులు..

నగరంలో 7,8,9 27 డివిజన్లలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఆయా డివిజన్లలో మట్టిరోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనన్నారు. డివిజన్‌కు రూ.కోటి పనుల్లో భాగంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.32 కోట్ల ఫండ్ ఉందని.. అయితే ఏడు డివిజన్లు రూరల్‌లో ఉన్నాయని వాటి అభివృద్ధికి కొద్ది ఫండ్ వెచ్చించిన అనంతరం మిగితా ఫండ్‌తో నగరంలోని మిగితా డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కూడా రూ.900 కోట్లు కూడా వచ్చేది ఉందని.. ఆ ఫండ్‌తో కూడా డెవలప్‌మెంట్ జరుగుతుందన్నారు. స్పెషల్ ఫండ్ కూడా ఆర్నెళ్లలో రావచ్చన్నారు. కార్యక్రమంలో మరో ముఖ్య అతిథి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కూరగాయల రమేష్ మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధి చెందాలంటే అందరూ ఐక్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. వినాయక నిమజ్జనం అనంతరం 27వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీల పనులు ప్రారంభం కానున్నాయన్నారు. డివిజన్‌కు రూ.కోటితో సైతం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు కల్వె చిరంజీవి మాట్లాడుతూ..ఆనంద్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం సీనియర్ సభ్యుల సలహాలు సూచనలతో ముందుకు సాగాలని సూచించారు. డివిజన్ అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులతో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



గణేశ్ మండపాల వద్ద సందడి..





నగరంలోని పలు వినాయకుల మండపాల వద్ద సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో ప్రజలు గణనాథుల మండపాలను సందర్శిస్తున్నారు. మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్





కామారెడ్డిలో భారీ వర్షం

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కురిసిన వర్షానికి కామారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని పలు రోడ్లు నీటితో నిండిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిరిసిల్ల రోడ్డు పూర్తిగా నీటితో నిండిపోయింది. గుంతలమయంగా ఉన్న సిరిసిల్ల రోడ్డులో ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి కిందపడిపోగా స్థానికులు వెంటనే స్పందించి కాపాడారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వెల్లడించిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా జుక్కల్ లో 55.0 మి.మీ వర్షపాతం నమోదైంది. భిక్కనూర్ లో 31.3 మి.మీ, సదాశివనగర్ లో 28.8, తాడ్వాయిలో 25.8, రామారెడ్డిలో 22.0, లింగంపేటలో 17.0, మాచారెడ్డి మండలం లచ్చాపేటలో 16.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే బీబీపేటలో 11.5 మి.మీ, కామారెడ్డి మండలం పాత రాజంపేటలో 9.8, గాంధారి మండలం గాంధారిలో 9.8, కామారెడ్డి కలెక్టరేట్ వద్ద 8.8, గాంధారి రామలక్ష్మణ్ పల్లెలో 6.3, పాల్వంచ ఎలుపుగొండలో 4.8, దోమకొండలో 2.3, రాజంపేట అర్గొండలో 2.3, మద్నూర్ సోమూర్ లో 1.3 మి.మీ వర్షం కురిసింది.



ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు కీలకం : ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి

అక్షరటుడే, ఆర్మూర్: గ్రామీణ ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మన ఊరు-మన భద్రత-మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆలూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్, సర్పంచ్ ముక్కెర విజయ్, వీడీసీ అధ్యక్షుడు మగ్గిడి సూర్య రెడ్డి, జీపీ కార్యదర్శి రాజలింగం పాల్గొన్నారు.



ప్లాస్టిక్ రహిత బాల్కొండలో భాగంగా స్టీల్ బ్యాంక్ ప్రారంభం

అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ పాలకవర్గం సహకారంతో ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇందులో 3,000 స్టీల్ ప్లేట్లు, 1,000 స్టీల్ గ్లాసులను అందుబాటులో ఉంచారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలకు ఇప్పటివరకు 42 యువజన సంఘాలు, వివిధ సంఘాలకు గ్రామ పంచాయతీ స్టీల్ బ్యాంక్ ద్వారా ఉచితంగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను అందించినట్లు తెలిపారు. సర్పంచ్ గాండ్ల రాజేష్, పిట్ల దయాకర్, తెడ్డు సందీప్, ఫాజిల్, అతిక్ పాల్గొన్నారు.

గురువు లేకుండానే.. తబలాలో అద్భుత ప్రతిభ



వయసు చూస్తే ఇతను తబలా వాయిస్తాడా.. ఇతనికి అంత టాలెంట్ ఉందా అనిపిస్తుంది. ఒక్కసారి తబలా చేతికి వచ్చిందా.. ఇక అంతే.. చేతివేళ్లు తబలాపై గిరగిరా తిరగాల్సిందే. పదమూడేళ్ల వయసున్న ఈ బాల కళాకారుడి గురించి ఎంత చెప్పినా తక్కువే. పేదరికంలో మగ్గుతున్నా అతని ఆలోచనలు అతన్ని కళాకారుడిగా మార్చాయి. చదువుకుంటూనే తబలా వాయిస్తూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు ఈ బాల మేధావి. కామారెడ్డి పట్టణానికి చెందిన ఈ బాలుడి ప్రతిభ చూస్తే ముక్కున వేలేసుకోవడం ఖాయం.
- అక్షరటుడే, కామారెడ్డి

- మూడున్నరేళ్ల సాధన.. వెయ్యి వేదికలపై ప్రభంజనం
- కామారెడ్డిలో బాల మేధావి అద్భుత ప్రతిభ
- పేద కుటుంబానికి అడ్డురాని కళ
- గురువు లేకుండానే సాధించిన అపూర్వ విజయం

కామారెడ్డి పట్టణంలోని అయ్యప్ప నగర్ కాలనీకి చెందిన సింధే పరమేశ్వర్ తబలా వాయించడం నేర్చుకోవడం మొదలుపెట్టి కేవలం మూడున్నరేళ్లు మాత్రమే అయింది. ఈ చిన్న వ్యవధిలోనే అతను ఏకంగా వెయ్యికి పైగా స్టేజ్ షోలు చేశాడు అంటే నమ్మడం కష్టమే. మొదట్లో పాఠశాలలో జరిగే చిన్న చిన్న సాంస్కృతిక కార్యక్రమాలతో మొదలైన అతని ప్రయాణం, ఇప్పుడు జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రముఖ దేవాలయ ఉత్సవాలు, ప్రైవేట్ వేడుకల వరకు విస్తరించింది. చిన్న చేతులతో అతను పలికించే తీన్ తాళ్, ఏక్ తాళ్, దాద్రా విని సంగీత విద్వాంసులే ముక్కున వేలేసుకుంటున్నారు.

ఏకలవ్య సాధన

ఈ కథలో అందరినీ ఆశ్చర్యపరిచే అంశం ఇదే. పరమేశ్వర్‌కు తబలా నేర్పిన గురువు ఎవరూ లేరు. ఏ సంగీత పాఠశాలకు వెళ్లలేదు. పూర్తిగా స్వయంకృషి ఫలితమే. చిన్నప్పుడు బంధువుల ఇళ్ల వద్ద, ఆలయాల వద్ద చేసే భజన కార్యక్రమాల్లో తబలా వాయిద్యం వింటూ అతనికి ఆసక్తి కలిగింది. చదువుకుంటూనే రోజూ స్కూల్ అయిపోగానే గంటల తరబడి సాధన చేసేవాడు. వివిధ భజన కార్యక్రమాల్లో వారి చేతి కదలికలను గమనిస్తూ, విని విని తబలా నేర్చుకున్నాడు. ఆకలిని కూడా మరిచిపోయి చేసిన ఆ సాధనే ఇప్పుడు అతన్ని ఈ స్థాయిలో నిలబెట్టింది.

ప్రభుత్వ గుర్తింపు - కుటుంబ నేపథ్యం

పరమేశ్వర్ ప్రతిభను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. అత్యంత చిన్న వయసులోనే అతనికి అధికారికంగా కళాకారుడిగా గుర్తింపు కార్డు మంజూరు చేసింది. అలాగే ముంబైలోని అఖిల భారతీయ గాంధర్వ మహా విద్యాలయ మండల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తబలా పోటీలో మొదటి స్థానంలో నిలిచాడు. నిజానికి పరమేశ్వర్‌ది నిరుపేద కుటుంబం. తండ్రి సాయిరాం ఆటో డ్రైవర్‌గా, తల్లి స్వప్న బీడీ కార్మికురాలిగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. అన్నయ్య ప్రస్తుతం నిజామాబాద్‌లో పాలిటెక్నిక్ చదువుతున్నాడు.

భవిష్యత్తుకు చేయూత అవసరం

ఇప్పటివరకు ఎలాంటి గురువు లేకుండా, సొంత సాధనతోనే ఈ స్థాయికి చేరుకున్న పరమేశ్వర్‌కు ఇకపై వృత్తిపరమైన శిక్షణ అత్యంత అవసరం. చిన్న తబలాతో ప్రాక్టీస్ చేస్తూ, ఉన్న వనరులతోనే ఇంత ప్రతిభ చూపిస్తున్న ఈ బాలుడికి ఒక మంచి క్వాలిటీ తబలా సెట్, సరైన సంగీత గురువు లభిస్తే అద్భుతాలు సృష్టిస్తాడని సంగీత ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్థికంగా చేయూతనిస్తే మరింత ప్రోత్సాహం లభిస్తుంది. కామారెడ్డి లాంటి చిన్న పట్టణం నుండి వచ్చిన ఈ నిరుపేద బాలుడిని జాతీయ స్థాయిలో తీర్చిదిద్దితే, రేపు దేశం గర్వించే గొప్ప తబలా విద్వాంసుడిగా ఎదుగుతాడనడంలో ఎలాంటి సందేహం లేదు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ భూమి పూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డిష్ ప్రకాష్, స్థానిక కౌన్సిలర్ భుపేందర్, కాలనీవాసులు సోడ రవి, బాలరాజు, గోపి, శ్రవణ్, ప్రవీణ్, శ్యాం, అనిల్, అరుణ్ రాజు, వేణు, శరత్, జేసు దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

అక్షరటుడే, ముప్కాల్: మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఎంపీడీవో బి.రమేష్, ఎస్సై కిరణ్ పాల్, ఎంపీవో సుధాకర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిమజ్జన ప్రాంతంలోని రివర్స్ పంపింగ్, భారీ గేట్లు, వరద కాలువ, ప్రాజెక్టు నీటి సామర్థ్యం తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. నిమజ్జనానికి అనువైన ప్రదేశాన్ని గుర్తించి, అక్కడ అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జన ప్రదేశానికి వెళ్లే రహదారిని శుభ్ర పరచడం, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ విజేతగా నిజామాబాద్



అక్షరటుడే, కమ్మర్‌పల్లి: రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ విజేతగా నిజామాబాద్ జట్టు నిలిచింది. కమ్మర్‌పల్లి మండలంలోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఫైనల్ పోరులో నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబర్చి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టుపై 9-3 తేడాతో ఘన విజయం సాధించి టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమ్మర్‌పల్లి సర్పంచ్ కొత్తపల్లి హరిక అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విజేత నిజామాబాద్ జట్టుతో పాటు పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. గెలిచిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ, ఓటమి చెందిన జట్లు నిరాశ చెందకుండా వచ్చే ఏడాది విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య హాజరై మాట్లాడుతూ.. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు 5 రోజులపాటు కమ్మర్‌పల్లి మినీ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్నేహపూర్వక సమ్మేళనమే ప్రసాద్ పార్టీ

అక్షరటుడే, ఇందూరు: వైశ్య సంఘం వినాయక మండపాల్లో నిర్వహించే స్నేహపూర్వక సమ్మేళనమే ప్రసాద్ పార్టీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని గంజ్‌లో పట్టణ వైశ్య సంఘంలో 'ప్రసాద్ పార్టీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... హిందూ సంస్కృతి సాంప్రదాయాలను ముందుకు నడపడంలో వైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. గత 55 ఏళ్లుగా తాను ప్రసాద్ పార్టీకి హాజరవుతున్నానని గుర్తు చేశారు. యువజన సంఘం కమిటీ వినాయకుని ఉత్సవాలను అద్భుతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. సంఘంలో 82 ఏళ్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో వైశ్య సేవా సంఘం గణేష్ మండలి అధ్యక్షుడు



శివకుమార్ గుప్తా, పట్టణ వైశ్య సంఘం ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, మోటూరి మురళి గుప్తా, అర్వపల్లి పురుషోత్తం గుప్తా, శ్రీనివాస్ గుప్తా, ఆయా అనుబంధ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి రెసిడెన్సీలో సిద్ధి,బుద్ధి వినాయక కల్యాణం



అక్షరటుడే, ఇందూరు: నగరంలోని శ్రీ వాసవి రెసిడెన్సీలో ఆదివారం శ్రీ సిద్ధి, బుద్ధి వినాయక కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. . ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కార్పొరేటర్ స్రవంతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు గూడెపు రఘువీర్, సెక్రటరీ దేవేందర్, కోశాధికారి గజ్జల నాగేశ్వరరావు, వాసవి రెసిడెన్సీ కార్యవర్గ సభ్యులు, వాసవి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సుభాష్ శర్మ పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మహాత్మ స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయం..



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలో పలు ఆలయాలు, పాఠశాలల్లో నిర్విరామంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ స్వచ్ఛ సేవలు అభినందనీయమని ఆర్మూర్ సర్వ సమాజ్ అధ్యక్షులు కొట్టాల సుమన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు హనుమాన్ ఆలయం, శని దేవాలయం ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయం ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం 72వ వారానికి చేరుకుందన్నారు. సద్గురు మహారాజ్ సుకుసంద్, బంజ రవి, రాజేష్ కన్నా, సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద జీడి రాజ్ కుమార్, బాశెట్టి గంగారాం, రమేష్, మహేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు తాడ్కోల్ యువకుడు



అక్షరటుడే, బాన్సువాడ: బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన శివ రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెం విభాగంలో శివ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం శివ బాన్సువాడ పట్టణంలోని స్పార్క్ మైండ్ పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఆదివారం పాఠశాల యాజమాన్యం, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్ పోటీల్లో మరింత ప్రతిభ కనబర్చి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పాశం రాజిరెడ్డి, కరస్పాండెంట్ కిరణ్, డైరెక్టర్ రామేశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుజారి చెరువులో పడి వ్యక్తి మృతి

అక్షరటుడే, గాంధారి: మండలంలోని పెద్ద చెరువులో కాలకృత్యాలకు వెళ్లి కాలుజారి చెరువు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దండు సాయిలు (65) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే శనివారం సాయంత్రం బయటకు వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో ఇంట్లో బంధువులు చుట్టుపక్కల ఆచూకీ కోసం గాలించారు. అయితే చివరకు పెద్ద చెరువులో శవం లభించగా అది సాయిలుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు పేలిన ఫోన్లు.. ఇద్దరు రైతులకు గాయాలు

అక్షరటుడే, గాంధారి: పిడుగుపాటుకు రెండు మొబైల్ ఫోన్లు పేలిపోగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గాంధారి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని బొబ్బజివాడి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు మేకల సూర్యకాంత్, శంకర్ లు గొడుగు పట్టుకొని పొలాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగుపడగా వారిద్దరి జేబుల్లోని సెల్‌ఫోన్లు పేలిపోయాయి. దీంతో వారిరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 ఈఎంటీ సురేష్, పైలెట్లు క్షతగాత్రులని గాంధారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

ముగ్గురు పిల్లలతో సహా మహిళ అదృశ్యం

అక్షరటుడే, కోటగిరి: కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామానికి చెందిన సాయిలత కుటుంబ కలహాలతో తన ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యమైంది. శుక్రవారం భర్త ప్రశాంత్‌తో గొడవ పడింది. అనంతరం తన పిల్లలు చైతన్య, చైత్ర, చైతుతో కలిసి పుట్టింటికి వెళ్తానని చెప్పి వెళ్లి అదృశ్యమైంది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుతో ఆలయ గోపురం పాక్షికంగా ధ్వంసం..

అక్షరటుడే, గాంధారి: పిడుగుపాటుతో ఆలయ గోపురం పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ఘటన గాంధారి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. గాంధారి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ శివారులో నూతనంగా శ్రీ సేవాలాల్ గుడి నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ క్రమంలో గోపురంపై ఆదివారం అకస్మాత్తుగా పిడుగుపడి దెబ్బతింది. దీంతో గోపురానికి పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సేవాలాల్ ఆలయంపై పిడుగు పడిన విషయం తెలుసుకున్న గిరిజనులు ఆలయానికి తరలివచ్చారు.

